# గ్రీన్ సిగ్నల్

● జమాల్‌పూర్ బాబూరావ్ ●

## సాయంత్రం ఆరు గంటలకు నాంపల్లి స్టేషన్ నుండి గోదావరి ఎక్స్‌ప్రెస్ కదిలింది.

ఆ రైలు వేగాన్ని పుంజుకుంది. శిరీష్ కుమార్ కిటికి ప్రక్కనే కూర్చుని మయూరి వార పత్రిక తిరగేస్తున్నాడు. తన ఎదుటి సీట్లో కూర్చున్న ఓ పాతికేళ్ళ యువతిని గమనించి వార పత్రికను పక్కకు పెట్టేశాడు. ఆమె ముఖం మీద పడుతున్న వెంట్రుకల్ని మృదువుగా వెనక్కు తోస్తోందామె. పసిమి ఛాయ, గండు తుమ్మెదలాంటి నల్లటి కళ్ళు, నవ్వినపుడు ఇలా కనిపించి అలా మాయమవుతున్న చెక్కిళ్ళ మీద గుంటలు అప్సరసలా ఉన్న ఆ అందగత్తెను చూసి, ఇలాంటి అమ్మాయి నాకు భార్య అయితే ఎంత బాగుండును అనిపించింది శిరీష్‌కుమార్‌కి. వాళ్ళ ప్రయాణం మౌనంగానే సాగుతోంది. చీకటి పడుతోంది. ఆకాశంలో నల్లటి మేఘాల కింద తెల్లటి పక్షులు బారుతో తీరి తమ గమ్యానికి చేరుకుంటున్నాయి. రైలు పరుగుతో పాటు పరిసరాలు మారుతున్నాయి. కొండలు గుట్టలు, పంటచేలు, స్తంభాలు ఒకదాని తర్వాత ఒకటి వెనక్కి పోతున్నాయి. రైలు రాక్షసిలా అరుస్తూ ముందుకు దూసుకుపోతోంది. చల్లటి గాలి తగలటంతో అతనికి కునుకు పట్టింది.

ఎంతసేపు పడుకున్నాడో గాని "సార్ డిన్నర్" అన్న బేరర్ పిలుపుకి మెలకువ వచ్చి చూసేసరికి ఎదుటి సీట్లో కూర్చున్న యువతి తనను అడగకుండానే వారపత్రిక చూస్తోంది. అతని చూపులు పూల బంతిలా ఆమెపై పడుతున్నాయన్న విషయం గ్రహించి చిరునవ్వుతో అతని వంక చూస్తూ "క్షమించండి మిమ్మల్ని అడక్కుండానే వారపత్రిక తీసుకున్నాను. ఇదిగో తీసుకోండి" అంటు వారపత్రికను తిరిగి ఇచ్చేస్తుంటే, "పర్వాలేదు చదువుకోండి అన్నట్లు మీ ప్రయాణం ఎంతవరకు" ధైర్యాన్ని కూడదీసుకొని అడిగాడు. "విశాఖపట్టణం వరకు చెప్పిందే తప్ప అతని ప్రయాణం ఎంత వరకు అని మాత్రం అడగలేదు, అయినా నా ప్రయాణం కూడ వైజాగ్ వరకే" అని చెప్పేసాడు అంతలో 'టీ' వాడు వస్తే రెండు టీలకు ఆర్డర్ ఇచ్చాడు. 'టీ' డబ్బులు అతనే ఇస్తుంటే వద్దండి" అంటు తాను ఇవ్వబోయింది. ఆమెని ఇవ్వనీయకుండా తానే అయిదు రూపాయల నోటు తీసి 'టీ' అబ్బాయికి ఇచ్చాడు. 'టీ' ఇద్దరు కలసి త్రాగకా వారి మధ్య కొన్ని నిమిషాలు మౌనం చోటుచేసుకున్నాయి. ఆమె నిద్రపోవాలని ఎంతగానో ప్రయత్నిస్తోంది. కాని నిద్ర రావడం లేదు. ఇనుప పట్టాల మీద రైలు చక్రాలు రాసుకొని లయబద్ధంగా వినిపిస్తున్న శబ్దానికి శిరీష్‌కుమార్‌కి కునుకు పట్టేసింది.

●●●

**అతని చూపులు పూల బంతిలా ఆమెపై పడుతున్నాయి.**

●●●

ఆ పాతికేళ్ళ యువతి శిరీష్ కుమార్‌ని తదేకంగా చూస్తూ అతన్నే మనసులో నిలుపుకొని ఏవేవో చిలిపి ఊహలు ఊహించుకుంటు తన్మయత్వంతో పొంగిపోతోంది. పరుగెడుతున్న రైలు వేగం తగ్గి పట్టాలు మారి రాత్రి 12 గం.లకు విజయవాడ స్టేషన్‌లో ఆగింది. అలజడికి శిరీష్‌కుమార్‌కి మెలకువ వచ్చింది. అప్పటికే ఆ యువతి రెండు కాఫీలు తెప్పించి శిరీష్‌కుమార్‌కి ఓ కాఫీ ఇచ్చి తనూ కాఫీ సేవిస్తోంది. శిరీష్‌కుమార్ కాఫీ తాగుతు "మీ పేరు చెప్పనేలేదు" అడిగాడు.

"నా పేరు శ్యామల" పేరు చెప్పింది. ఈసారి మాత్రం శ్యామలే కాఫీ డబ్బులు ఇచ్చింది. "మీరు ఎక్కడ ఉద్యోగం చేస్తారు" అడిగింది అతని వంక చూస్తూ. "లేదండి నాకు ఇంకా ఉద్యోగం దొరక లేదు. ఉద్యోగ ప్రయత్నంలోనే ఉన్నాను. రేపు విశాఖపట్టణంలోని ఓ పెద్ద కంపెనీలో ఇంటర్వ్యూ ఉంది. అందుకే వెళుతున్నాను" చెప్పాడు. "ఈ ఉద్యోగం తప్పకుండ మీకే వస్తుందని నమ్మకంగా ఉంది నాకు" ఆ మాటల్లో ఎంతో ఆనందం కనిపించిదతనికి. ఎక్కడైతె ఆనందం ఉంటుందో అక్కడే అందం కూడ వుంటుందని గ్రహించాడు శిరిష్‌కుమార్. శిరిష్‌కుమార్ మనస్తత్వాన్ని అర్ధం చేసుకుంది శ్యామల. అతనిలో స్వార్ధం కించిత్ అయినా కనిపించలేదామెకు. అతనంటే ఏదో తెలియరాని అభిమానం ఏర్పడింది ఆమె హృదయంలో. ఓ తెల్ల కాగితం మీద తన ఇంటి నంబర్‌తో సహా అడ్రస్ వ్రాసి అతనికిచ్చింది. "ఇంటర్వ్యూ కాగానే ఇంటికి రావాల్సిందిగా శిరిష్‌కుమార్‌ని కోరింది. అందుకు అతను వస్తానని మాటిచ్చాడు శ్యామలకి. ఓ అనామకుడిని ఇలా

●●●

## అతనంటే ఏదో తెలియని అభిమానం ఏర్పడింది.

●●●

ఇంటికి ఆహ్వానించడం ఏమైనా బాగుందా! ఆమె మనసు ఎందుకో ఘోషించింది. అతనిలో కనిపిస్తున్న నిస్వార్ధం చూస్తుంటే ఆమె కెందుకో ఓ విధమైన భావం కలుగుతోంది. ఆమె ఆలోచనలు అతని చుట్టూ తిరుగుతున్నాయి. వాళ్ళ రైలు ప్రయాణం ప్రేమతో ముడి వేసింది. రైలు అనకాపల్లి దాటి విశాఖ పట్టణం స్టేషన్‌లో ఆగింది. శిరిష్‌కుమార్, శ్యామల ఇద్దరు కలసి ఓ హోటల్లో కాఫీ సేవించారు. శిరీష్‌కుమార్ వన్ టౌన్‌లోని జాతీయ బ్యాంక్‌లో 11 గం.లకు ఇంటర్వ్యూ ఉందని చెప్పాడు. శ్యామల ఆ బ్యాంక్ వద్దకు 12 గం.లకు వస్తానని, ఆ తర్వాత లోకల్ బస్సుతో పాటు అరకు లోయలోని ప్రకృతి అందాలను చూపిస్తానని చెప్పేసరికి అతని మనసు ఎగిరి గంతులేసింది. శ్యామల అక్కడి నుండి వెళ్ళిపోయింది. శిరిష్‌కుమార్ ఇంటర్వ్యూ మరో రోజుకు వాయిదా పడింది. ఈ ఉద్యోగం తనకు వస్తుందో రాదో తెలియని పరిస్థితి. ఉద్యోగం లేని నన్ను శ్యామల ప్రేమిస్తుందా? నా కోసం 12 గం.లకి వస్తానన్న శ్యామల వస్తుందా ? అన్న ప్రకారమే బ్యాంక్ వద్దకి లేత ఆకుపచ్చ రంగులో ఉన్న వెడల్పాటి జరీ అంచు చీర కట్టుకొని చిరునవ్వు చిందిస్తూ వచ్చింది. శ్యామల నిజంగానే అందగత్తె. ఆమె స్వభావము అతనికి నచ్చింది. ఇద్దరు కలసి అరకు లోయకు




బయలుదేరారు. అరకు లోయ చేరేసరికి మధ్యాహ్నం ఒంటిగంట దాటింది. అరకు లోయలోని సౌందర్యాల్ని చూస్తు పరవశించి పోయారు. ఒకచోట సినిమా వాళ్ళు, పాటల సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు. వీరిద్దరు ఓ మూల చెట్టు కింద కూర్చుని ఏవేవో కబుర్లు చెప్పుకుంటున్నారు. "శ్యామలా! నా ఇంటర్వ్యూ రేపటికి వాయిదా పడింది" అని చెప్పేసరికి శ్యామల ఆనందంతో "అంటే మనం మరో రోజు ఎంజాయ్ చేసే అవకాశం ఉందన్నమాట" పెదవులపై చిరునవ్వు చిందిస్తూ అంది.

"శ్యామలా నిన్ను పెళ్ళి చేసుకుంటాను, నీకు అభ్యంతరం లేకపోతే..." ఆమె కళ్ళలోకి చూస్తూ అంటున్న అతనికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంది. మోడువారిన జీవితానికి నీరు పోసి జీవం పోస్తున్నందుకు అతన్ని దైవంగా మనసులో మలచుకుంది. కాని తనకు జరిగిన అన్యాయాన్ని చెప్పాలని ప్రయత్నించే లోపలే శిరిష్‌కుమార్ అడ్డుపడటం వలన తన అభిప్రాయాన్ని వాయిదా వేసింది. ఇద్దరూ కలిసి ఓ హోటల్లో భోజనం ముగించుకొని విశాఖపట్టణంలోని ఇండస్ట్రియల్ ఏరియాని షిప్ యార్డ్‌ని, చూడడానికి నడుస్తున్నారు. వాళ్ళు అలా నడుస్తుంటే భార్యా భర్తల్లా కనిపిస్తున్నారు అందరికి. అంతలోనే తమ వైపు వస్తున్న ఒకతన్ని చూసి శ్యామల కొద్దిగా తత్తరపాటు పడింది. అతను శ్యామలని సమీపించి "అమ్మా శ్యామలా మళ్ళీ పెళ్ళి చేసుకున్నావా? చాలా మంచి పని చేశావ్ ఆ భగవంతుడు నీ పట్ల అన్యాయం చేశాడు, నీ చిన్నతనంలోనే పెళ్ళి కావడం పెళ్ళైన కొన్నాళ్ళకే నీ భర్త చనిపోవడం, ఆ తర్వాత నిన్ను ఓ మూర్ఖుడు లొంగదీసుకొని మోసం చెయ్యాలని ప్రయత్నించడం అపుడు నా మనసు" అంటు చెబుతున్న ఆ మాటలు శిరిష్‌కుమార్ గుండెల్లోకి తూట్లు పడేలా, తుపాకి గుళ్ళలా దూసుకుపోతుంటే అక్కడ ఉండలేక వెంటనే కదిలాడు. శ్యామల తనకు జరిగిన అన్యాయాన్ని వివరించింది. శిరిష్ కుమార్ ఈ విషయం మీకు అరకు లోయలోనే చెప్పాలని ప్రయత్నించాను. కాని మీరు అపుడు నాకు అవకాశం ఇవ్వలేదు. నన్ను క్షమించండి" అందని దానికోసం ఆశపడటం నాదే తప్పు వస్తా" అంటు వెళ్ళిపోయింది శ్యామల. శిరిష్‌కుమార్ గుండెను వేళ్ళతో పెకలించినట్లుగా ఉంది. కనిపించినంత దూరంలో చీకటి నిశ్శబ్దం. ఆ రాత్రంతా ఆలోచనలతో గడిచిపోయి చివరికి ఓ నిర్ణయానికి వచ్చాడు శిరిష్‌కుమార్. రేపు జరగబోయే ఇంటర్వ్యూలో సెలక్ట్ అయ్యేలా చూడమని భగవంతున్ని ప్రార్థించుకున్నాడు. శ్యామల తన దురదృష్టాన్ని తలచుకుని భోరున ఏడుస్తుంది. తను చేస్తున్నది మంచో చెడో తెలియని వయస్సు, జీవితాంతం ఇక కోరికల్ని చంపుకొని బ్రతకడమేనా? అలా అయితే ఈ బ్రతుకెందుకు? ఆమె మనస్సు నానా విధాలుగా పరుగెడుతోంది. భర్తను పోగొట్టుకున్న దురదృష్టవంతురాలు, ఆమెకు తగిలిన దెబ్బ సామాన్యమైనది కాదు. గతంలోని అనుభవాలు జ్ఞాపకాలు ఆమె కళ్ళ ముందు మెదులుతు మానుతున్న మానసిక గాయాన్ని రేపుతుంటాయి. అంత అన్యాయం జరిగినందుకు దేవుడి మీద కూడ కోపం వస్తుంది. ఆమె మానసిక స్థితిని అర్థం చేసుకొని సానుభూతి చూపేదెవరు? అభిమానం, ఆదరణ చూపుతున్నట్లే నటిస్తూ ఆమె అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని స్వప్రయోజనం పొందాలని చూసే మోసగాళ్ళు కొందరుంటారు.

అలాంటి వాళ్ళ నుండి దూరంగా ఉండాలంటే, తిరిగి పెళ్ళి చేసుకోవడంలో తప్పేముంది? సమాజం విధించిన ఆచారాలకు పద్ధతులకు సాంప్రదాయాలకు తలవంచి తిరిగితే తన మానసిక క్షోభను ఎవ్వరు దూరం చేస్తారు? అందుకే స్త్రీ ధైర్యం చేసి అడుగు ముందుకు వేసి తన భవిష్యత్తును తానే నిర్ణయించుకోవాలి. కాని.... కాని.... భర్త చనిపోయిన దాన్ని ఎవ్వరు పెళ్ళి చేసుకోవడానికి ముందుకొస్తారు. కనుక ఆమె మనసు ఎన్నో విధాలుగా తపించి పోతోంది. గాయాన్ని కాలమే మాన్పుతుంది. శిరిష్‌కుమార్ ఇంటర్వ్యూ జరిగిపోయింది. ఆ ఇంటర్వ్యూలో పాసయ్యాడు. హైదరాబాద్‌లోనే పోస్టింగ్ ఇచ్చారు. అతనికి చెప్పలేనంత ఆనందంగా ఉంది. శ్యామల ఒక్కసారిగా హృదయంలో మెదిలింది. వెంటనే శ్యామల వ్రాసి ఇచ్చిన అడ్రస్ ప్రకారం వెళ్ళాడు ఆమె కోసం. ఇంట్లో ఎవ్వరూ లేరు. తలుపు చప్పుడు చేశాడు. ఓ 70 సం.రాల ముసలామే వచ్చి "శ్యామల మేడపై తన గదిలో ఉందని" చెప్పగానే గబగబా మేడపైకి ఎక్కి శ్యామల గదిలోకి ప్రవేశించాడు. శ్యామల ఏడ్చి..... ఏడ్చి.... అలానే బెడ్ పై పడుకుంది. శ్యామల పరిస్థితిని గమనించిన అతని హృదయం జాలితో నిండిపోయింది. అతనామె చేతిని పట్టుకొని శ్యామలా అని ఆప్యాయంగా, ప్రేమగా పిలిచాడు అతని స్పర్శకు ఆమె కళ్ళు తెరిచింది.

అతన్ని చూస్తునే ఆమె కళ్ళలో ఆనందం ఒక్కసారిగా తళుక్కుమంది. ఆమెని తన హృదయానికి హత్తుకొని మృదువుగా "శ్యామలా నిన్ను పెళ్ళి చేసుకుంటాను. నీలాంటి అందమైన భార్య లభిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. నీ కోసమే నేమో నాకు బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. హైదరాబాద్‌లో పోస్టింగ్ ఇచ్చారు" ఆ మాటలు వింటున్నంతసేపు ఆమె హృదయం ఆనందంతో పరవశించి పోయింది. అతని మాటలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్లుగా అతనిని అల్లుకుపోయింది. ●



## 'షారుక్' గాయపడ్డాడు

నిర్మాత, దర్శకుడు యాష్‌చోప్రా లంహే, చాందిని, విజయ్ చిత్రాల తర్వాత ప్రస్తుతం 'డర్' చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. ఆ చిత్రాలలాగనే ఈ చిత్రాన్ని కూడా స్విజ్జర్ లాండ్‌లోనే నిర్మిస్తున్నాడు. ఆ షూటింగ్‌లో హీరో షారుక్‌ఖాన్‌కి గాయం అవ్వటం వలన కొన్ని రోజులు రెస్టు తీసుకోవాల్సి వచ్చింది. ఆ చిత్రంలో అతనితో పాటు సన్నీడియోల్, జుహి చావ్లాలు నటిస్తున్నారు.